ఆకాశవాణి కేంద్రం హైదరాబాద్

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 06.09.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఖమ్మం జిల్లాలో మున్నేరు వరదతో పాటు ఇటీవలి భారీవర్షాలకు కలిగిన నష్టాన్ని పరిశీలించేందుకు, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, తదితరులు జిల్లాలో పర్యటిస్తున్నారు.
2. హైదరాబాద్ ఉస్మానియా వైద్య కళాశాల విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించనున్న హాస్టల్ భవనాలకు మంత్రులు దామోదర రాజనర్సింహ , పొన్నం ప్రభాకర్ లు ఈరోజు భూమి పూజ చేశారు.
3. ప్రధానమంత్రి నరేంద్ర మో దీ లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన స్వచ్ఛభారత్ మిషన్ వల్ల 2011- 2020 సంవత్సరాల మధ్యలో ఏటా , భారత్ లో 60 నుంచి 70 వేల శిశు మరణాలను నివారించగలిగినట్టు ఒక అధ్యయనం తెలిపింది.
4. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ లో ఇటీవల చోటుచేసుకున్న మతఘర్షణల అనంతరం ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడుతోంది.

**కేంద్రమంత్రి పర్యటన :**

ఖమ్మం జిల్లాలో మున్నేరు వరదతో పాటు , ఇటీవలి భారీవర్షాలకు కలిగిన నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తదితరులు ఈరోజు ఖమ్మం జిల్లాలో పర్యటిస్తున్నారు. తొలుత ఏరియల్ సర్వే ద్వారా వారు వరదనష్టాన్ని పరిశీలించి , పాలేరు వద్ద సాగర్ ఎడమకాలువకు పడిన గండిని పరిశీలించారు. జుజ్జులరావుపేటలో వరదల వల్ల నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి, అనంతరం ఫొటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. కేంద్ర మంత్రుల పర్యటనలో , రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామిరెడ్డి తదితరులు పాల్గొంటున్నారు. **PTC**

## హాస్టల్ భవనాలకు భూమి పూజ

హైదరాబాద్ కోఠీ లోని ఉస్మానియా వైద్య కళాశాల వైద్య విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించనున్న హాస్టల్ భవనాలకు మంత్రులు దామోదర రాజనర్సింహ ,పొన్నం ప్రభాకర్ లు ఈరోజు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్ ,ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ , వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ , వైద్య ఆరోగ్య రంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టు మంత్రి తెలిపారు. 121 కోట్ల రూపాయల వ్యయంతో భవనాల నిర్మాణానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్టు ఆయన తెలిపారు.
**PTC**

## స్వచ్ఛభారత్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన స్వచ్ఛభారత్ మిషన్ వల్ల 2011 2020 సంవత్సరాల మధ్యలో ఏటా , భారత్ లో 60 నుంచి 70 వేల శిశు మరణాలను నివారించగలిగినట్లు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ సైన్స్ జర్నల్ నేచర్ లో ప్రచురితమైన ఒక అధ్యయనం వెల్లడించింది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం ఒహాయో స్టేట్ యూనివర్సిటీ కి చెందిన అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధన సంస్థ పరిశోధకులు స్వచ్ఛభారత్ మిషన్ కూ శిశు మరణాలు ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాల రేట్లకు మధ్య కల సంబంధం పై కూలంకషంగా అధ్యయనం చేశారు. 2011 2020 సంవత్సరాల మధ్య దేశం లో 35 రాష్ట్రాలు 640 జిల్లాల్లో శిశు మరణాలకు సంబంధించిన గణాంకాలను వారు అధ్యయనం చేసారు. స్వచ్ఛ భారత్ మిషన్ అమలు చేసిన కాలంలో అంతకుముందు సంవత్సరాలతో పోలిస్తే శిశు మరణాలు గణనీయంగా తగ్గాయని ఈ పత్రంలో పేర్కొన్నారు. మెరుగైన నీరు పారిశుధ్య పరిస్థితుల వల్ల భారత వంటి దేశాల్లో శిశు మరణాలను నివారించడం సాధ్యమన్న విషయం ఇది రుజువు చేసిందని పరిశోధకులు చెప్పారు .**NSD**

## ఉపాధ్యాయులకు అవార్డులు

ఉపాధ్యాయులు పట్టుదలతో పని చేస్తే ,సమాజానికి ఆణిముత్యాలాంటి పౌరులను తయారు చేయవచ్చని రాష్ట్ర రోడ్లు , భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నిన్న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నల్లగొండలో , జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి

రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి జ్ఞాపికలు అందచేసి సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ , మనిషి తలరాతను మార్చే ఏకైక వ్యక్తి ఉపాధ్యాయుడే అని , అందుకే పాఠశాలలను సందర్శించినప్పుడు తనకు దేవాలయాలను సందర్శించిన అనుభూతి కలుగుతుందని చెప్పారు. రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నల్గొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచేందుకు జిల్లా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. **PTC**

## ఉపాధ్యాయ అవార్డు

సిరిసిల్ల పట్టణంలోని కుసుమ రామయ్య జిల్లా పరిష త్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తు న్న పాకాల శంకర్ గౌడ్ నిన్నహైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నా రు. మంత్రి పొన్నం ప్రభాక ర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. **PTC**

## INTERNET SERVICES

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ లో పరిస్థితి క్రమంగా కుదుటపడుతోంది. పోలీస్ యంత్రాంగం మండలంలో సెక్షన్ 144 అమలు చేస్తున్నారు. జైనూర్ లో బుధవారం రెండు వర్గాల మధ్య ఘర్షణల నేపథ్యంలో మండలంలో పలు హింసాత్మక సంఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. కాగా జైనూర్ మండలంలో రవాణ సౌకర్యాలను పునరుద్దరించారు. ఇతర ప్రాంతాల నుంచి కొత్త వాళ్లు మండలంలోకి రాకుండా చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. కాగా , జిల్లాలోని అన్ని మండలాల్లో ఇంటర్నెట్ సేవలను పోలీసులు నిలిపివేశారు. తహసిల్దార్ కార్యాలయాలు, పోస్టల్ కార్యాలయాలతో పాటు బ్యాంకులు మాత్రమే పని చేశాయి. మిగతా చోట్ల ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇంటర్నెట్ సేవలు పనిచేయకపోవడంతో , కలెక్టరేట్ లో అన్ని విభాగాల అధికారులు ఒకే వైఫై తో ఒకేచోట పనిచేస్తూ కనిపించారు.. వ్యాపారాలకు సంబంధించి ఫోన్ పే, గూగుల్ పేలు పనిచేయకపోవడంతో పలుచోట్ల గిరాకీలు తగ్గినట్లు వ్యాపారస్తులు తెలిపారు.**PTC**

## యాడ్ జైనూర్

జైనూర్ మండలంలో జరిగిన ఘటనపై అందరూ సంయమనం పాటించాలని అదనపు డి. జి. (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్ అన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా శాంతియుతంగా

ఉండాలని, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు 144 సెక్షన్ కొనసాగడంతో పాటు, ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. **PTC**

**భూసారం**

భూసారం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని ఏఈవో ముత్తయ్య తెలిపారు. భూసారం తెలుసుకునేందుకు సాయిల్ హెల్త్ కార్డులు అందిస్తున్నామని ఆయన తెలిపారు. భూమిలో ఎన్.పి.కె. - నత్రజని, పాస్పరస్, పొటాష్ శాతం తెలుస్తోందని అన్నారు. మట్టిని సేకరించి ల్యాబుకు పంపిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా తిర్యాని ఏఈవో ముత్తయ్య ఆకాశవాణితో మాట్లాడుతూ...

**(సౌండ్ బైట్)**

**భద్రాచలం..వరద నీరు**

ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి కాస్త తగ్గడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గింది. నిన్న సాయంత్రానికి 45 అడుగులకు పైబడి ప్రవహించిన గోదావరి నీటిమట్టం , క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం 42.8 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. **PTC**

**జాతీయ లోక్ అదాలత్**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ను పురస్కరించుకొని సిరిసిల్లలో బీమా కంపెనీ ప్రతినిధులు , న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక సంఖ్యలో కేసులను లోక్ అదాలత్ ద్వారా పరి ష్కరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. **PTC**

**JITTA DEATH**

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు భారత రాష్ట్ర సమితి నాయకుడు , జిట్టా బలకృష్ణారెడ్డి ఈ ఉదయం కన్నుమూశారు. ఆయన వయస్సు 52 సంవత్సరాలు. మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ఆయన గత కొద్ది రోజులుగా , సికింద్రాబాద్ లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొం దారు. యువజన సంఘాల నేతగా సేవా కార్యక్రమాలతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి , భారత రాష్ట్రసమితి, యువ తెలంగాణ పార్టీ , కాంగ్రెస్, భారతీయజనతాపార్టీల్లో వివిధ హోదాల్లో ఆయన పని చేశారు. మూసి ప్రక్షాళన

కోసం  గతంలో ఆయన పాదయాత్ర  నిర్వహించారు. మూసి కాలుష్య పీడిత గ్రామాలలో , దాతల సహకారం తో సుమారు వందకు పైగా నీటి ఫిల్టర్లను ఏర్పాటు చేసి జలదాతగా పేరుగాంచారు ... జిట్టా బాలకృష్ణారెడ్డికి భార్య, కుమార్తె, కుమారుడు ,తండ్రి ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని భువనగిరి శివారు లోని ముగ్దంపల్లి రోడ్ లో ఉన్న వ్యవసాయ క్షేత్రానికి తరలిస్తున్నారు.  **PTC**

**(యాడ్  మేటర్) సంతాపాలు**

జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు     ,ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన పోరాటంలో   జిట్టా బాలకృష్ణ రెడ్డి క్రియాశీలకంగా పాల్గొన్నారని , మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు     తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు. బాలకృష్ణారెడ్డి మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. **PN**

**వడ్డేపల్లి కృష్ణ మృతి**

ప్రముఖ గేయ రచయిత,  సిరిసిల్ల పట్టణానికి చెందిన వడ్డెపల్లి కృష్ణ ఈ రోజు  ఉదయం మృతి చెందారు.  గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. వడ్డేపల్లి కృష్ణ          తెలుగు సినీ పరిశ్రమలో రచయితల సంఘానికి విశిష్ట సేవలను అందించారు. వీరు ఎన్నో కవితలు , సినిమా పాటలు, లలిత గేయాలు రాశారు. వీరు రాసిన లలిత గేయాలు ఆకాశవాణి రేడియో కేంద్రం ద్వారా ప్రసారం అయ్యాయి. **PTC**

**గణేశ్ నవరాత్రి**

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా     ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో కోరారు. మండపాల వద్ద నిరంతరం పోలీసుల భద్రత       , బందోబస్తు,  నిఘా ఉంటుందని పేర్కొన్నారు. గణేశ్ మండపాల నిర్వహణ బాధ్యత నిర్వాహకులదేనని, ప్రతీ మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలకు ఇబ్బందులు కల్గించవద్దని      ,  ప్రజా రవాణాకు సమస్య తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. **PTC**